పోసాని బెయిల్ పిటిషన్ విచారణ 5కు వాయిదా

ప్రజాశక్తి - కడప

సినీ నటుడు, వైసిపి నాయకులు పోసాని కృష్ణ మురళీ బెయిల్ పిటిషన్‌పై విచారణను కడప కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. పోసానిని 5 రోజులు కస్టడీకి కోరుతూ కడప పోలీసులు కోర్టులో పిటిషన్ వేశారు. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీసులు కస్టడీ పిటిషన్‌ను వేశారు. పోసానికి బెయిల్ కోరుతూ ఆయన తరపున న్యాయవాదులు పిటిషన్ వేశారు. రైల్వేకోడూరు మేజిస్ట్రేట్ సెలవులో ఉన్నందున కడప కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ పిటిషన్‌పై విచారణను కడప కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. పోసానిని కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు వేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 5కు కోర్టు వాయిదా వేసింది. పోసాని బెయిల్ పిటిషన్‌పై కూడా విచారణ 5కు వాయిదా వేసింది. రాజంపేట సబ్ జైలు నుంచి పీటీ వారెంట్‌పై పల్నాడు జిల్లా నరసరావుపేట పోలీసుస్టేషన్‌కు పోసానిని తరలించారు.

కొప్పర్తికి మహర్దశ!

- ఫేజ్-1 కింద రూ.1,654 కోట్లతో అభివృద్ధి
- కడపలో ఐరన్‌ఓర్, యురేనియం వనరులు పుష్కలం
- అన్నమయ్యలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్షరింగ్ ఎకోసిస్టమ్
- 2026 నాటికి కడప విమానాశ్రయ విస్తరణ పూర్తి

సోషియో ఎకనమిక్ సర్వేలో సర్కారు వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కొప్పర్తి పారిశ్రామి కవాడకు మహర్దశ పట్టనుంది. విశాఖపట్నం-చెన్నయ్ పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి పరచడంలో భాగంగా ఫేజ్-1 కింద రూ.1,654 కోట్లతో 2,596 ఎకరాలను అభివృద్ధి పరచనున్నారు. రూ.202 కోట్ల పైప్‌లైన్ మొదలుకుని పలు పరిశ్రమలు ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన సోషియో ఎకనమిక్ సర్వేలో పలు రంగాల వారీగా అంశాలను వెల్లడించింది. కడప జిల్లాలో ఐరన్‌ఓర్, యురే నియం నిల్వలు పుష్కలముగా ఉన్నాయని, సహజ వనరులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపింది. 2026 జనవరి నాటికి కడప విమానాశ్రయ టర్మినల్ పనులను పూర్తి చేయనున్నట్లు చెబుతోంది. ఇప్పటికే 19 శాతం పనులు పూర్తి చేసినట్లు పేర్కొంది. ఫలితంగా కడప ఎయిర్‌పోర్టు నుంచి వాణిజ్య సర్వీసులను నిర్వహించాలనే ఆలోచనలు ఉన్నాయని స్పష్టం చేసింది. గండికోట పరిసర ప్రదేశంలోని 40 ఎకరాల్లో రూ.2,500 కోట్లతో ఒబెరాయ్ హోటల్స్ రిసార్ట్ వంటి అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొంది. రూ.77.01 కోట్ల కేంద్ర నిధుల సహాయంతో శశి పథకం కింద గండికోట పర్యాటక ప్రాజెక్టును ఆకర్షణీయంగా తీర్చిదిద్దు తామని పేర్కొంది. ఇక్కడి నుంచి సీప్లేన్ తదితర కమర్షియల్ సదుపా యాలను అభివృద్ధి పరచనున్నట్లు తెలిపింది. జిల్లాలో రూ.650 కోట్లతో భారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. జిల్లాలోని 464 ఎకరాల విస్తీర్ణం కలిగిన లంకమల, అన్నమయ్య జిల్లాలోని 172 ఎకరాల విస్తీర్ణంలోని వెంకటేశ్వర అభయారణ్య పరిరక్షణకు కృషి చేయనున్నట్లు పేర్కొంది. అన్నమయ్య జిల్లాలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్షరింగ్ ఎకో సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొనడం గమనార్హం. వీటితోపాటు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,500 కోట్లతో ఎర్రచందనం పరిరక్షణ కేటాయించగా, అందులోరూ.152 కోట్లు ఖర్చు చేశామని పేర్కొంది. 2024-25 సంవత్స రానికి రూ.822 కోట్లు కేటాయించినట్లు సర్వేలో పేర్కొనడం గమనార్హం. కడప, అన్నమయ్య జిల్లా పరిధిలోని 5,300 స్వేర్ మీటర్ల పరిధిలోని ఎర్రచందనం పరిరక్షణకు కట్టుబడి ఉన్నాయని పేర్కొంది.

మినిమం టైం పేస్కేల్ అమలు చేయాలి

ట్రిపుల్‌ఐటి గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో పని చేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీలకు మినిమం టైంపే స్కేల్ అమలు చేయాలంటూ సోమవారం కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇడుపులపాయి ట్రిపుల్ ఐటిలోని అకడమిక్ బ్లాక్ వద్ద గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. దీంతో ఎస్ఐ తిరుపాల్ నాయక్ ధర్నా జరిగే ప్రాంతానికి చేరుకొని ధర్నా విరమింప జేయాలని ఉద్యోగులను కోరారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ అకడమిక్ బ్లాక్ వద్దకు చేరుకొని ధర్నా చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు ససేమిరా అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ జీవో నెంబరు 110ను ఆర్‌జెయుకెటి అధికారులు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కూడా గౌరవించకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. గెస్ట్ ఫ్యాకల్టీ సమస్యలను పలుమార్లు విద్యాశాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేదన్నారు. ప్రభుత్వం నుంచి సరైన హమీ వచ్చే వరకు ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 2018లో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులుగా ఆర్‌జెయుకెటి పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటిల్లో 44 మంది పని చేస్తున్నారని, ఉద్యోగంలో చేరినప్పటి నుండి ఒక రూపాయి కూడా జీతం పెంచలేదని చెప్పారు. గత ప్రభుత్వం జిఒ 117ను తెచ్చి అమలు చేసిందని చెప్పారు. కొత్త మందికి మాత్రమే అమలు చేశారని చెప్పారు. ఛాన్సలర్‌తో పాటు వైస్ ఛాన్సలర్, నాలుగు ట్రిపుల్ ఐటిల డైరెక్టర్లకు కూడా వినతి పత్రం అందజేశామని, అయినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మినిమం టైం పే స్కేల్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. గవర్నింగ్ కౌన్సిల్ అంటూ మాటను దాట వేస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్వహించిన గవర్నింగ్ కౌన్సిల్ కు ప్రిన్సిపల్ సెక్రటరీ రాలేదంటే ఎంత దౌర్భాగ్యస్థితి ఉందో అర్థం అవుతుందని తెలిపారు. 2018 నుండి రూ.25 వేల జీతంతో పని చేస్తున్నట్లు చెప్పారు. నిత్యావసర వస్తువులు పెరుగుతున్నాయి తప్ప తమ జీతాలు మాత్రం పెరగడం యూనివర్సిటీ ఉన్నతాధికారులు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అరోపించారు. కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా తెలిపారు. కన్వర్షన్స్ కోసం గవర్నింగ్ కౌన్సిల్‌లో పెట్టాలని నిర్ణయించడం జరిగిందని చెప్పారు. గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం ప్రకారం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అంతవరకు వేచి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీలతో మాట్లాడుతున్న ఎస్ఐ, ట్రిపుల్‌ఐటి అధికారులు

ప్రజా ప్రతినిధులు స్పందించాలి

నిరసనలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేస్తున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

బడ్జెట్‌పై శాసనసభలో ప్రజాప్రతినిధులు స్పందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై కడప జిల్లా పట్ల వివక్ష, కక్ష సాధింపు ధోరణికి వ్యతిరేకంగా సోమవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రాయలసీమ సాగునీటి వనరుల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు చేయకపోవడం చాలా అన్యాయమన్నారు. రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాజెక్టులకు నిధులు, నికరజలాలు కేటాయించి ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రభుత్వం అలసత్వాన్ని విడనాడాలని కోరారు. పాలకులు ప్రభుత్వాలు పట్టించుకోకుండా, అభివృద్ధి వికేంద్రీకరణ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, మళ్లీ ఇప్పుడు అనేక రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతీయ ఉద్యమాలు రావడానికి అవకాశం కల్పిస్తున్నారని విమర్శించారు. 48 ఏళ్లుగా రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తికి, రిజర్వాయర్ల పంట, పిల్ల కాలువలు పూర్తికి శ్రద్ధ పెట్టడం లేదని తెలిపారు. రాయలసీమలోని 'బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్' వద్దకు ఎత్తిపోతల ద్వారా తెస్తామని నమ్మ బలుకుతున్నారని, ఎన్ని దశాబ్దాలు పడుతుందో తెలియదని, రాష్ట్రంలోని టిడిపి, ఎన్‌డిఎ ప్రభుత్వం భవిష్యత్తు నాలుగున్నర సంవత్సరం తమ కాల వ్యవధిలో ప్రజలను మభ్యపెట్టి జారుకోవడానికి పన్నిన కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు బి.మనోహర్, దస్తగిరి రెడ్డి,అన్వేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, నగర కార్యదర్శి విజయ్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఐ.ఎన్.సుబ్బమ్మ, సిఐటియు నాయకులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి : జెసి

ప్రజాశక్తి - కడప

ప్రతిజ్ఞ చేస్తున్న జెసి అదితిసింగ్

బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారమని, బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సభాభవన్ లో మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలలో భాగంగా 'బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్'గా తీర్చిది ద్దుతాం అని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేస్తామని చెప్పారు. అనంతరం అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్ర మంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీలక్ష్మి, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. **కొవ్వొత్తులతో ర్యాలీ..** జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డి. శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల కార్యక్ర మంలో భాగంగా సోమవారం సాయంత్రం హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు, మహిళా సంఘాల మహిళలతో కలెక్టరేట్ నుంచి మహావీర్ సర్కిల్ వరకు బాల్య వివాహరహిత జిల్లాగా చేసేందుకు పిలుపునిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సంతకాల సేకరణ కూడా చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్,మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్, స్వయం సహాయక సంఘాల మహిళలు మరియు వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు

రైతులకు రుణ సహకారం అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్‌చెరుకూరి

వ్యవసాయంలో అధునాతన సాంకేతికతకు అవసరమైన పెట్టుబడుల కోసం రైతులకు రుణ సహకారం అందించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి బ్యాంకు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణాలు అందించడంలో సెప్టెంబర్ మాసంతానికి గాను వైఎస్ఆర్ జిల్లా పురోగమనంలో కొనసాగుతున్నందుకు బ్యాంకర్లను అభినందించారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా జిల్లాలో డిఆర్‌డిఎ, మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి జిల్లా ఆర్థిక అభివృద్ధిలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. బ్యాంకర్లు పొదుపు సంఘాల మహిళలకు రుణాలు అందించి ఆర్థిక చేయుతనిచ్చి జిల్లాను ఆకాంక్ష జిల్లా లక్ష్య సాధనలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలన్నారు. సేంద్రియ సాగుబడిలో పండించిన పంట దిగుబడులకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి చురుకుగా ఉన్న స్వయం సహాయక గ్రూపులను, రైతులను గుర్తించి వారిని ఈ కామర్స్ బిజినెస్‌లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో నాబార్డ్ ఎజిఎం విజయ విహారి, రిజర్వ్ బ్యాంక్ ఎల్‌డిఒ నవీన్ కుమార్, కెనరా బ్యాంకు ఎజిఎం మురళి మోహన్, ఎస్‌బిఐ ఎజిఎం వాణీ కిషోర్ కుమార్ రెడ్డి, యూబిఐ ఎజిఎం లక్ష్మీ తులసి, ఎపిజిబి ఎజిఎం శ్రీనివాస ప్రసాద్, కెడిసిసి సిఇఒ రాజమ్మ, డిఆర్‌డిఎ పీడీలు ఆనంద్ నాయక్, పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, వసాయ అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పదు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పదని పాత కడప జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విశ్వ భారతి అన్నారు. సోమవారం క్రాఫ్ట్ ఉపాధ్యాయులు జైని. నాగభూషణరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థానానికి చేరుకునేలా తీర్చిదిద్దారని కొనియాడారు. పరిసరాల శుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారని తెలిపారు. జైని నాగభూషణరావు మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో 36 సంవత్సరాల పాటు వివిధ పాఠశాలల్లో పనిచేశానని పేర్కొన్నారు. తన వద్ద విద్యను అభ్యసించిన వారు ఉన్నత స్థానాలకు చేరుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. తమ పిల్లలతో పాటు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తామన్నారు. సభ అనంతరం జైని నాగభూషణరావు భార్య భాగ్యలక్ష్మి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూలో ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయ కాలేజ్ డే, ఫౌండేషన్ డే సందర్భంగా కళాశాల అంతర విభాగ క్రీడా పోటీలు సోమవారం నిర్వహించారు. విద్యార్థుల క్రికెట్ ఫైనల్ పోటీలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ ప్రారంభించారు. పోటీలలో ఎర్త్ సైన్స్, బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్ జట్టు విజయం సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానం మేనేజ్మెంట్ స్టడీస్ జట్టు నిలిచింది. నాన్ టీచింగ్ ఫైనల్ మ్యాచ్‌లో గ్రీన్ కింగ్స్ లెవెన్ జట్టు విజయం సాధించారు. వేమన వారియర్స్ రెండవ స్థానంలో నిలిచారు. విజేతలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. పద్మా, క్రీడా బోర్డు కార్యదర్శి, వ్యాయామ విద్యా, క్రీడ శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ కె.రామ సుబ్బారెడ్డి విజేతలను అభినందించారు.

తక్షణమే రిటర్న్ మస్టర్ ఎత్తివేయాలి

ధర్నాలో మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్

ప్రజాశక్తి - కడప అర్బన్



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

రిటర్న్ మస్టర్ రాష్ట్రంలోని ఏ జిల్లాలో లేదని, కేవలం కడప నగరంలోనే ప్రత్యేకంగా అమలు చేస్తూ కార్మికులను దొంగలుగా చిత్రీకరించడం దారుణమని, వెంటనే రిటర్న్ మస్టర్‌ను ఎత్తివేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మున్సిపల్ కార్మికులు ఐదు గంటలకి మస్టర్‌కి రావా లంటే దూర ప్రాంతం నుంచి వచ్చే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలి పారు. కాలువ కుప్పలు పచ్చివి ఎత్తాలంటే మహిళలకు చాలా ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. ఎన్నిసార్లు కార్పొరేషన్ అధికారులు చెప్పినా పట్టించుకోక పోవడంతో ధర్నా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూ నియన్ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరామ్, నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, డ్రైవర్ కమిటీ కార్యదర్శి సుంకర కిరణ్, నాగరాజు, పెంచలమ్మ, హేమలత, రమాదేవి, ఒంగోలు ఆదాము, కార్మికులు పాల్గొన్నారు.

పోసాని కృష్ణ మురళిని నరసరావుపేటకు తరలిస్తున్న పోలీసులు

నరసరావుపేట కోర్టుకు 'పోసాని' తరలింపు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సినీ రచయిత, నటుడు పోసాని కృష్ణ మురళికి కేసుల ఉచ్చు బిగుసుకుంటోంది. వైసిపి ప్రభుత్వంలో చంద్రబాబు, లోకేష్ బాబు, పవన్ కల్యాణ్‌లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు గాను అన్నమయ్య జిల్లా ఓబుల వారిపల్లె మండలంలో నమోదైన కేసుతో విచారణ అనంతరం ఫిబ్రవరి 26న రైల్వేకోడూరు మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధిస్తూ రాజంపేట సబ్ జైలుకు తరలించారు. గుండె సంబంధిత వ్యాధితో అస్వస్థతకు గురైనట్లు పోసాని నడిపించిన హైడ్రామాతో రాజంపేట ప్రాంతీయ వైద్యశాలతో పాటు కడపలోని రిమ్స్ వైద్యులు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఎటువంటి అనారోగ్య సమస్య లేదని తేల్చడంతో తిరిగి పోసానిని పోలీసులు రాజంపేట సబ్ జైలుకు తరలించారు. మూడు రోజులు రాజంపేట సబ్ జైలులో ఉన్న పోసానిని నరసరావుపేటలో నమోదైన క్రైమ్ నెంబర్ 142/2024 కేసు కారణంగా టూటౌన్ సిఐ రామారావు సోమవారం పిటి వారెంటుతో రాజంపేటకు చేరుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం పోసానిని తీసుకుని నరసరావుపేట కోర్టుకు హాజరు పరిచేందుకు తరలించారు. ఆయనపై బిఎన్ఎస్ యాక్టు 153, 504, 67 సెక్షన్ల కింద నరసరావుపేటలో కేసులు నమోదయ్యాయి. పోసానిపై బాపట్ల, యాదమరి, పుత్తూరు, పాలకొండ, విజయవాడ, పాతపట్నం, రాజంపేట, రైల్వే కోడూరు, ఓబులవారిపల్లె, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లా, విశాఖపట్నం, అనంతపురం, పల్నాడు తదితర ప్రాంతాలలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 కేసులు నమోదయ్యాయి. ఈ కేసులు 30కి పైగా చేరుకునే అవకాశం ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలుపుతున్నాయి. నరసారావు పేటలో కోర్టు విచారణ అనంతరం పోసాని కృష్ణమురళిని రిమాండ్ నిమిత్తం అక్కడే ఉంచుతారా లేదా తిరిగి రాజంపేట సబ్ జైలుకు తరలిస్తారా అన్నది తెలియాల్సి ఉంది. పోసాని అరెస్టుతో ఒక్కసారిగా వైసిపి శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఓవైపు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి ఎస్టేట్ వ్యవహారం, పోసాని కృష్ణమురళి రాజంపేట సబ్ జైలుకు తరలిరావడంతో అన్నమయ్య జిల్లా వైసిపి శ్రేణులలో తీవ్ర అలజడి నెలకొందని చెప్పుకోవచ్చు.

దీక్ష విరమించిన గౌస్‌పీర్

ప్రజాశక్తి - కడప అర్బన్

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రద్దు చేయాలని 36 గంటలు చేపట్టిన దీక్షను సయ్యద్ గౌస్ పీర్ సోమవారం రాత్రి 7 గంటలకు విరమించారు. దీక్షను కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బండి జకరయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కమిటీలతో కాలక్షేపం చేయొద్దు : డిసిసి

మాట్లాడుతున్న విజయజ్యోతి

ప్రజాశక్తి - కడప : చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం కమిటీలతో కాలక్షేపం చేయకుండా బిసిలకు 50 సంవత్సరాలకే నెలకు రూ. 4 వేల పెన్షన్ ఇవ్వాలని డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి డిమాండ్ చేశారు. సోమవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాగళం ఉమ్మడి మేనిఫెస్టో - 2024 ప్రకారం బిసి డిక్లరేషన్ పేరిట బిసిలకు 50 సంవత్సరాలకే నెలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామన్నారు కానీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. రక్షణ కోసం ప్రత్యేక చట్టం ఇంతవరకు తీసుకురాలేదని చెప్పారు. బిసి సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి దాదాపు 9 నెలలు అయిపోతుంది ఇంతవరకు అటువంటి ప్రణాళిక ఏమీ లేదని వాపోయారు. ఇప్పటికైనా ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం బిసి డిక్లరేషన్ అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని చేస్తుం దన్నారు. విలేకరుల సమావేశంలో సిటి అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, కడప అసెంబ్లీ కో- ఆర్డినేటర్ బండి జకరయ్య, పి.డి. సంజయ్ కాంత, మైనుద్దీన్, మామిళ్ళ బాబు, రఫీక్ ఖాన్, హమీద్ పాల్గొన్నారు.

గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన పథకాలను కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని విజయ జ్యోతి మైనారిటీ నేతలకు సూచించారు. నూతనంగా నియమితులైన మైనారిటీ నేతలతో సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విజయ్ జ్యోతి, నగర అధ్యక్షులు అఫ్సల్ ఖాన్, కడప అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త బండి జకరయ్యతో కలిసి సమావేశం నిర్వహించారు.

లింగ నిర్ధారణ ప్రకటనపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు లింగ నిర్ధారణపై ప్రకటనలు ఇస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పిసి అండ్ పిఎన్‌డిటి యాక్టును సంబంధిత ఆస్పత్రులు పటిష్టంగా అమలు చేయడంతో పాటు తప్పనిసరిగా జిల్లా అప్రాప్రియేట్ అథారిటీలో నమోదై చట్టంలోని సూచనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. లేకపోతే నిర్వాహకులకు రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు జరిమానాతో పాటు మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష ఉంటుందని పేర్కొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : కేంద్ర ప్రభుత్వం సంస్థ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కడపకు చెందిన ఆది రవికుమార్ పై చర్యలు తీసుకుని, డబ్బులు కట్టిన లక్షలు రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని డివైఎఫ్ఐ కడప జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. సోమవారం బాధితులతో కలిసి కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కడప జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిసిడిఒ (కెరీర్ కౌన్సిల్ డెవలప్మెంట్ కో- ఆర్డినేటర్)ఉద్యోగం పేరుతో కడపకు చెందిన ఆది రవికుమార్ అనే వ్యక్తి జిల్లాలో భాదితులు వద్ద ఒక్కొక్కరి వద్ద రూ. 4 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు డబ్బులు వసూలు చేశారన్నారు. ఇలా మొత్తం జిల్లాలో 21 మంది దగ్గర డబ్బులు వసూలు చేశారన్నారు. ప్రభుత్వ కళాశలాలో ప్రిన్సిపల్స్‌కు, ఆర్‌జెడి, డిఇవిఒ అధికారులకు సైతం ఫేక్ మెయిల్స్ పంపి ఉద్యోగాలు అపాయింట్మెంట్ లెటర్‌లు పంపి అధికారులను మోసం చేశాడన్నారు. బాధితులు మోసపోయామని తెలిసి ఆది రవికుమార్‌ను తాము కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే నెలల తరబడి తిప్పుకుంటూ చివరికి బెదిరిస్తున్నారని చెప్పారు. మోసపోయిన వారు తమ బాధఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు స్పందించి మోసపోయిన బాధితులకు ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని డబ్బులు రికవరీ చేయించాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -కడప అర్బన్

జెసికి సమస్యను వివరిస్తున్న మనోహర్

మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలు పరి ష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెసి అదితి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ సమస్యల పరిష్కారానికి ఆందోళన బాట పడతామని పేర్కొన్నారు. ఆప్కాస్ విధానం రద్దు చేయవద్దని, అలా చేస్తే మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులతో పాటు ఆప్కాస్‌లతో పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని తెలిపారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం రూ. 24, 500 వేతనం ఇవ్వాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ సమస్య పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్మికులకు యూనిఫామ్ అందించాలని చెప్పారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా చూపించడంతో గ్యాస్ సబ్సిడీ, సంక్షేమ పథకాలు అందడం లేదని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటి అమలు చేయాలని, మినీ సెంటర్‌లను మెయిన్ సెంట్రల్ గా మారుస్తూ జీవో ఇవ్వాలని పేర్కొన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు మంజూరు చేయాలని తెలిపారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్ లైన్స్ రూపొందించి అమలు చేయాలని చెప్పారు. రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. వీరికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న విజయవాడలో మహా ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు, ఆయాలు, కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి, సుబ్బలక్ష్మి, ఉమాదేవి, శివలీల, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి, నాయకులు ఆనందరావు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జియోన్ కళాశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం మహిళా ఉద్యోగుల ఎపి ఎన్‌జిఒ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, జియన్ ప్రిన్సిపల్ రోడా మెర్సీ, ఎంపిడి తరుణ్ నగేష్ ఆటలు పోటీలు నిర్వహించారు. మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షలు నిర్మల జ్యోతి, కన్వీనర్ భారతి షాట్ పుట్, జావిల్లిన్ త్రో, డిస్కస్ త్రో,మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా విభాగం నాయకులు కృష్ణ కుమారి, జానకి, పద్మజ, లక్ష్మి, ప్రమీల జ్యోతి, ఎ.కె.పద్మ, అరుణమ్మ, గాయిత్రి, చందన, సంగీత, స్వర్ణలత, రోజా, నాయకులు నిత్యపూజయ్య, శ్రీనివాసులు, శైలేశ్వర్ రెడ్డి, నాగార్జున, పద్మనాభం,రాయచోటి యన్ జి వో సెక్రటరీ డి.వెంకటేశ్వర్ రెడ్డి, రాయచోటి బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు ఆర్. జయచంద్ర, మహిళా ఉద్యోగుల పాల్గొన్నారు.

నిరాశపర్చిన బడ్జెట్ : వైసిపి

ప్రజాశక్తి- కమలాపురం టౌన్ : వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా సంక్షేమం లేదని వైసిపి కమలాపురం ఇన్‌ఛార్జి నరేన్ రామాంజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో గ్యారెంటీలు కాస్త బూరడీలుగా మారాయని, ఇచ్చిన హామీలన్నింటిలో కోతలు విధించారని చెప్పారు. రాష్ట్రం దివాలా తీసి ఉంటే బడ్జెట్ తగ్గాలని, ప్రజలపై ఎలాంటి భారం వేయమని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రతి వస్తువుపై పన్నులు వేయడంతో పాటు కొత్తగా రోడ్లపై టోల్ గేట్లు పెడతా మని చెబుతున్నారని తెలిపారు.అధికారంలోకి వచ్చాక పెన్షన్లకు పెంచామని ఆర్భాటంగా ప్రకటించారని, తీరా బడ్జెట్‌లో పెన్షన్లలో కోతలు తప్పవని సంకేతాలిచ్చారని ఆరోపించారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న సిఐ సురేష్‌రెడ్డి

వ్యాయామం తప్పనిసరి : సిఐ

ప్రజాశక్తి - వేంపల్లె

శారీరక, మానసిక ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి అని, విద్యార్థులు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సిఐ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం విద్యార్థులకు క్రీడలు, యోగా, విద్యా బుద్ధులపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ కనీసం కొన్ని నిమిషాలపాటు యోగా చేయడం మంచిదని సూచించారు. క్రీడల పట్ల కూడా మక్కువ పెంచుకోవాలని కోరారు. భవిష్యత్‌ను మెరుగు పరుచుకునేందుకు క్రమశిక్షణతో చదవాలన్నారు. తల్లిదండ్రులు గర్వించేలా మంచి ప్రవర్తనతో విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు నిర్వహించిన ఆటలపోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, విద్యార్థులు, పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వెలుగులోకి బ్రిటిష్ కాలం నాటి తూర్పు బావి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పాతమామిళ్ల పల్లె తూర్పు వైపున బ్రిటిష్ కాలం నాటి బావి వెలుగులోకి తెచ్చినట్లు రచయిత, చరిత్ర కారుడు బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ మైదుకూరు మున్సిపాలిటీలో 1905 బ్రిటిష్ సర్వే మ్యాప్ ఆధారంగా ఈ బావి 1268 సర్వేనెంబర్‌లో ఉందన్నారు. ఆనాటి కాలంలోని పిచ్చపాడు గ్రామం (చాపాడు మండలం)లో 400 కుటుంబాలు ఉండేవని, వాటిలో ఎక్కువగా కాల్వ, కోనేటి, కాట్రగడ్డ, మామిళ్ళపల్లె, పిచ్చపాటి అను ఇంటి పేరు గల బ్రాహ్మణులు నివసించేవారన్నారు. పిచ్చపాడు గ్రామాన్ని బ్రాహ్మణ అగ్రహారంగా పిలిచేవారు.బ్రాహ్మణులు పాత మామిళ్లపల్లెలో కూడా నివసించేవారని చెబుతున్నారు. పాతమామిళ్లపల్లెకు చెందిన కాల్వ బ్రాహ్మణులు కరణాలుగా పని చేసే సమయంలో ఈ బావిని నిర్మించారని తెలిపారు. బావి గుండ్రంగా, చిన్నదిగా ఉందన్నారు. ఎటుచూసినా బావి 12 అడుగుల కటకం ఉంటుందన్నారు. బావికి కుడి వైపు మెట్లు ఉన్నాయని వెల్లడించారు. ఈ బావిలోని నీటిని కపిలాల ద్వారా ఆ కాలంలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని సాగు చేసేవారన్నారు. తాగునీటి అవసరాలకు ఈ బావి నీటిని ఉప యోగించేవారని వివరించారు. బ్రిటీష్ కాలం నాటి ఈ బావి గురించిన సమా చారం తనకు తెలిసేందుకు పాత మామిళ్లపల్లెకు చెందిన ఉత్తమ రైతు అవార్డు గ్రహీత పందిటి క్రిష్ణమూర్తి, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానో పాధ్యాయులు గోశెట్టి రామ్మోహన్, శ్రీనగరం రాఘవ సహకరించారని రమేష్ వివరించారు.

మురుగు కాలువల ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు పట్టణంలోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు అధికంగా ఉన్న కడప రోడ్డులో తారు రోడ్డు నుండి మురుగు కాలువ వరకు ఉన్న ఆక్రమణలు, దుమ్ము ధూళిని తొలగించి ప్రయాణికులకు కనీస వసతులు మెరుగు పరచాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ కోరారు. ప్రొద్దుటూరు ఆర్అండ్‌బి కార్యాలయ డివిజనల్ ఎఇఇ రామకృష్ణారెడ్డికి సమస్యలను రాతపూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మైదుకూరు పట్టణం గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీగా మారి 13ఏళ్లు పూర్తయినా, పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రధాన రోడ్ల సౌకర్యం కల్పించలేదన్నారు. కేవలం ఉదయం పూట రోడ్డును శుభ్రపరచడం తప్ప ప్రభుత్వ శాఖలైనా ఆర్అండ్‌బి, మున్సిపల్ శాఖలు సమన్వయ లోపంతో రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టలేదన్నారు. రోడ్డు అక్రమణలు జరుగుతూ ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నా, ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. వెంటనే మున్సిపల్, ఆర్అండ్‌బి అధికారులు సమన్వయంతో రోడ్డు ఆక్రమణలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవాసమితి జిల్లా సమితి సభ్యుడు మూలే రామాంజనేయరెడ్డి, ఎపి అభివృద్ధి వేదిక నాయకుడు గంజికుంట నాగరాజు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో గ్రామ దత్తత కార్యక్రమంలో భాగంగా 'కౌమార దశ బాలికలకు రక్తహీనత నివారణ' అంశంపై సోమవారం బ్రాహ్మణపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకురాలు అరుణ రక్తహీనత నివారణ గురించి వివరించారు. ఐరన్, హెమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండడం వల్ల బాలికల్లో కళ్లు తిరగడం, అలసట వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, డ్రై ఫ్రూట్స్‌లో ఐరన్ పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, డాక్టర్ సాయి శ్రీనివాస్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మారతమ్మ, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి సన్నిధిలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె దేవళాలు వీరభద్రస్వామి సన్నిధిలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో సోమవారం అన్నదానం కార్యక్రమం నిర్వ హించారు. వీరభద్ర స్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమానికి విశ్వనాథపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు ఇరగంరెడ్డి కార్తీక్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వీరభద్రస్వామి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పెరుగు నారాయణ యాదవ్, గోసుల వీరారెడ్డి, గుత్తి వీరనారాయణ యాదవ్, ఆర్యవైశ్య సభ అన్న సత్రం అధ్యక్షులు దొంతు సుబ్రమణ్యం, వీరారెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముద్దనూరు

మహిళలు, బాలికల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిఐ దస్తగిరి సూచిం చారు. మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా సోమవారం సిఐ దస్తగిరి ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలోని బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు పరిశీలిస్తున్న మైనుద్దీన్

వంతెన ఆధునికీకరణకు నోచుకునేనా..?

భారీ వర్షానికి నీట మునిగిన వంక (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రానికి సమీపంలోని నక్కలదిన్నె గ్రామానికి వెళ్లే దారిలో గుండ్ల వంకపై ఉన్న వంతెన ఆధునీకరణకు నోచుకునేదెన్నడని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆధునీకరణకు నోచుకోలేదు. వర్షాకాలంలో ఈ మార్గాన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో నీరు తగ్గుముఖం పట్టే వరకు మండల కేంద్రంతో సంబంధాలు లేకుండా పోతున్నాయి. శాస్త్ర సాంకేతికంగా దేశం ఎంతగానో అభివృద్ధి చెందినప్పటికీ పల్లెలు మాత్రం పాత విధానంలో నడవాల్సి వస్తోంది. వర్షం వస్తే కొన్ని రోజులుగా మండల పరిధిలోని కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రజలు గ్రామాలకే పరిమితమయ్యే పరిస్థితి. ప్రభుత్వాలు మారుతున్నా వాగులు, వంకలపై పురాతన పాత వంతెనలే దర్శనమిస్తున్నాయి. మునకకు ఆస్కారం లేకుండా హై లెవెల్ వంతెనల ఏర్పాటు జరగడం లేదు. వర్షానికి నీట మునిగిన సందర్భంలో ఆర్అండ్‌బి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్ట డం తర్వాత వాటి గురించి పట్టించుకోవడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. మూడేళ్ల క్రితం వారం రోజులపాటు రాకపోకలు నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న వంతెన తక్కువ ఎత్తులో ఉండడంతో వంకకు నీరు అధికంగా వస్తే మునిగిపోతుంది. ప్రస్తుతం వంతెన పూర్తిగా దెబ్బతిని ఇబ్బందికరంగా మారింది. ఈ మార్గాన రాజువారిపేట, అయ్యవారిపల్లె, తిమ్మాయిపల్లి, నక్కలదిన్నె, అనంతపురం, కుచ్చుపాప, రాజుపాలెం, నరహరిపురం, వెదురూరు, రామసుబ్బమ్మ కొట్టాల గ్రామాల ప్రజలు ప్రయాణించాల్సి ఉంది. వర్షాకాలంలో ఈ మార్గాన రాకపోకలు నిలిచిపోతే ఆయా గ్రామాల ప్రజలు తాళ్లమాపురం, ప్రొద్దుటూరు మీదుగా చాపాడుకు రావాల్సి ఉంటుంది. మండల పరిధిలోని గుంతచియ్యపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న వంతెన కూడా ప్రమాదపుటంచున ఉంది. మోస్తరు వర్షం వచ్చినా ఈ వంతెన నీట మునుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాబోయే వర్షాకా లానికైనా వంతెనలను ఎత్తు పెంచి, ప్రజల సమస్యలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న లో లెవెల్ బ్రిడ్జి

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

పజాశక్తి - చాపాడు

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ తెలిపారు. స్థానిక కార్యాలయ ఆవరణలో సోమ వారం ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారమన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం అభి వృద్ధికి ఆటంకమని వివరించారు. మహిళల కలలను సాకారం చేసుకునే అవ కాశాలను దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేయాలన్నారు. సమాజంలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. బాలల విద్య, భద్రత కోసం ప్రతి ఒక్కరూ తమ గళాన్ని వినిపించాలన్నారు. బాల్య వివాహ రహిత సమాజం సాకారానికి కృషి చేయాలని ఆమె కోరారు. అనంతరం సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, వెలుగు ఎపిఎం శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి పేర్కొన్నారు. సింహాద్రిపురంలో ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం మత పెద్దలు, తల్లులతో బాల్య వివాహాలపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వసంతకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాల్య వివాహాలు చేసిన, చేసుకున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటారని వివరించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

చక్రాయపేట : నేటి ఆడబిడ్డలే.. రేపటి అమ్మలు, ఆడపిల్లను చదివిద్దాం' అంటూ సోమవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సూపర్‌వైజర్ సుభద్ర ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ రాజశేఖర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి నవంత్ బాబు, ఆర్ఐ, అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు

కొండాపురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం కొండాపురం హై స్కూల్‌లో బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై ఆరోగ్య, ఐసిడిఎస్ శాఖలు సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం వలన కలిగే ఇబ్బందులు, చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నిర్మూలనకు టోల్ ఫ్రీ నెంబర్ 1098ను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, రాణి, తులసి, వసంత, లక్ష్మి, సులోచన, పోలీస్ మౌనిక, ఐసిడిఎస్ సూపర్వైజర్, హెల్త్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

వేంపల్లె : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నుండి అంగన్వాడీ కార్యకర్తలు బిడ్డాలమిట్ట వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎపిఎం వెంకటేశ్వర రావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరత్న, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేముల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం సభా భవనంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.హసీనా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, ఎంఇఒ చంద్రశేఖర్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఆడపిల్లలు బాగా చదువుకున్నప్పుడే దేశం బాగుంటుందని తెలిపారు. ఆడపిల్లలే దేశానికి గర్వకారణమన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రజాక్, హెల్త్ సూపర్వైజర్, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఆందోళన వ్యక్తం చేస్తున్న శిశువు తండ్రి గురుమోహన్

వైద్యం వికటించి శిశువు మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

చికిత్స చేయించి శిశువును కాపాడుకుందామని ప్రొద్దుటూరు వారాహి ఆసుపత్రికి వస్తే.. సరైన వైద్యం చేయక 12 రోజుల శిశువు మృతి చెందింది. ఈ సంఘటన ప్రొద్దుటూరులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఎలా ఉన్నాయి.. గండికోటకు చెందిన గురు మోహన్ భార్య 12 రోజుల క్రితం శిశువుకు జన్మనిచ్చింది. శిశు ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్సకని వారాహి ఆసుపత్రిలో చేర్పించారు. పది రోజులు చికిత్స చేసిన అనంతరం వైద్యం వికటించి శిశువు ఆదివారం రాత్రి మృతి చెందింది. ఈ సందర్భంగా శిశువు తండ్రి గురు మోహన్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఇక్కడి వైద్యులు మాయమాటలతో తమని మోసం చేశారని రూ.లక్షలు దండుకున్న అనంతరం మృత శిశువును తమ చేతికి ఇచ్చారని విలపించాడు. మెరుగైన వైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్తామని తాము చెప్పిన ఇక్కడి వైద్యులు మభ్య పెట్టారని వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ఆసుపత్రి వైద్యంపై విచారణ చేయాలని కోరారు.

నాయకులతో సమావేశమైన వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

సంస్థాగతంగా పార్టీని పటిష్టం చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సంస్థాగతంగా వైసిపిని పటిష్టం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఇంట్లో సోమవారం పార్టీ నాయకులతో ఆయన చర్చించారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. అధికార పక్షం చేసే మోసాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరిస్తూ ముందుకు సాగాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో తామంతా కార్యకర్తలకు తోడుగా ఉంటామని భరోసా కల్పించాలన్నారు. అంతేకాక ఈ తొమ్మిది నెలల్లో తెలుగుదేశం పార్టీ నుంచి ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ చింతకుంట ఖాజా మొహిదీన్, పాతకోట బంగారురెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి పాల్గొన్నారు.

లింగాలలో దూడలకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

గాలికుంటు వ్యాధిని గుర్తించాలి

ప్రజాశక్తి - లింగాల

పశువుల్లో ఎక్కువగా సోకే గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి మంగేష్ సూచించారు. తుది దశలోనే వ్యాధిని గుర్తించాలన్నారు. మండలంలోని లోపట్నూతల, లింగాలలో సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమంలో భాగంగా ఆయన పాడి పశువులు, పొట్టేళ్లకు జాతీయ పశువైద్య నియంత్రణ పథకం కింద టీకాలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. సకాలంలో టీకాలు వేయించి వ్యాధులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో మురారి చింతల పశువైద్యాధికారి సుబ్బారాయుడు, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ ముఖ్యం

- ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి అధ్యక్షతన జంతు శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై నివసిస్తున్న ప్రతి ప్రాణికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి ప్రాణి విశిష్టమైందని గుర్తించి, సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సి.నం సింహారావు మాట్లాడుతూ 2025 సంవత్సరానికి ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం ప్రత్యేకత, డిజిటల్ ఇన్నోవేషన్ ఫర్ వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ అనే నినాదంతో జరుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అయ్యవారిరెడ్డి, రాధారామ్, నవనీశ్వర్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, సుబ్బరాయుడు, అనురాధ, లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలో పశు వైద్య విద్యార్థులు

స్టయిఫండ్ పెంచకపోవడం అన్యాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

తమకు స్టయిఫండ్ పెంచకపోవడం అన్యాయమని పశువైద్య విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రూరల్ పరిధిలోని గోపవరం పంచాయతీలోని పశు వైద్య కళాశాల విద్యార్థులు తమకు స్టయిఫండ్ పెంచాలని 29 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం విదితమే. ఈ సందర్భంగా సోమవారం దీక్షలో వారు మాట్లాడుతూ తాము ఇన్నిరోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక, రాజస్తాన్, కేరళ, రాష్ట్రాల్లో రూ.23 వేలు, బిహార్‌లో రూ.24వేలు, ఒరిస్సాలో రూ.22 వేలు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో రూ.23,500, తమిళనాడు, హర్యానా, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్‌లో రూ.25 వేలు ఇస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో 12 ఏళ్లుగా రూ.7వేలు ఇస్తున్నారని వారు తెలిపారు. ఇది పశువైద్య విద్యార్థులను బానిసలుగా చూడడమే అవుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు కూడా స్టయిఫండ్ పెంచాలని కోరారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

గుట్కా, డ్రగ్స్, సిగరెట్ వంటి చెడు అలవాట్ల జోలికి వెళ్లవద్దని పట్టణ వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. స్థానిక ఐటిఐ కళాశాలలో సోమవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చెడు అలవాట్లు ఉంటే వెంటనే మానుకోవాలన్నారు. బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని వివరించారు. బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ కె.ఆనంద్, హెల్త్ సూపర్వైజర్ ఓబులేసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడిఒ వెంగమునిరెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమస్యలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దీవస్ తదితర వాటిపై ఎంపిడిఒ సమీక్షించారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ రమేష్ బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటేష్, పిఆర్ ఎఇ సుధీర్, హౌసింగ్ ఎఇ నాగజ్యోతి, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి సురేష్ బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమూర్తి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం పంచాయతీ సెక్రటరీ, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లలో సర్వేలు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లోలేని ప్రభుత్వ ఉద్యోగులను సైతం గుర్తించి సర్వే చేయాలన్నారు. సర్వే ఆధారంగానే భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాలను అందజేయనున్నట్లు ఆయన వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న బచ్చల పుల్లయ్య

పనుల నాణ్యతలో రాజీపడొద్దు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నియోజకవర్గ పరిధిలోని గోపవరం గ్రామం జ్యోతినగర్‌లో రూ.6 లక్షల ఎంజిఎన్ఆర్‌సిసి నిధులతో నూతనంగా ప్రారంభించిన సిసి రోడ్డు పనులను సోమవారం మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, కాంట్రాక్టరుతో రోడ్డు పనుల నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. రోడ్ల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీను, డీలర్ సుబ్బయ్య, ఆచారి, జిసి పుల్లయ్య, కులాయిరెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

E.P.No. 113/2023
O.S.No. 66/2016

Gandluru Satish Reddy, S/o Veera Krishna Reddy, aged 59 Years, Hindu, R/o. D.No.7/826, Saraswathi Vidyamandir Road, YMR Colony, Proddatur Town, Kadapa Dist.
...Petitioner/D.Hr.

Vs

Devireddy Manohar Reddy, S/o Rama Subba Reddy, aged 55 years, Hindu, R/o Plat No.602, Preety Residency Apartment, Aravindha Ashramam Road, YMR Colony, Proddatur Town, Kadapa Dist.
...Respondent/J.Dr.

నోటీసు

ఈ నెంబరు E.P.ని, రెస్పాండెంట్/J.Dr. అయిన మీపైన రాజశ్రీ కోర్టు నందు దాఖలు చేసినారు. అట్టి E.P.లో రెస్పాండెంట్/J.Dr. అయిన మీరు రాజశ్రీ కోర్టు వారి నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా మీరు హాజరు అగుటకుగాను 27.03.2025వ తేదీన పై కోర్టు నందు వాయిదా ఉంటూఉన్నది. పై కోర్టు నందు ఉదయం 10.30 గం॥లకు మీరు పైన తెలిపిన కోర్టు నందు హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు గాని, మీ వకీలు ద్వారా గాని తెలుపుకొనవలెను. లేనంతట మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 27.03.2025.

//By Order of the Court//
B.C.MADAIAH
C.PAVAN KUMAR REDDY
Advocates,
PRODDATUR.